క్లుప్తంగా

వైభవంగా కోదండ రామాలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ గ్రామంలో గల కోదండరామ ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వేకువ జాము నుంచే పూజలు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, నాయకులు మొయిద అక్కోజీ, కర్రోతు వెంకటరమణ, వాల్లే అప్పలనాయుడు, అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

పేదలకు చేయూతనివ్వడంలోనే సంతృప్తి



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న గణపతిరావు

విజయనగరం ఫోర్ట్: పేదలకు చేయూతనివ్వడంలో సంతృప్తి ఉందని వ్యాపారవేత్త నాగమల్లి గణపతిరావు అన్నారు. ఆదివారం స్థానిక కణపాక అగురవీధిలో మారుతీ స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో పేదలు, దివ్యాంగులకు బియ్యం, గోధుమ నూక, నూనె వంటి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆదారి వెంకటేశ్వరావు, గుత్తురు చంద్రశేఖర్, అప్పలస్వామి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సన్యాసినాయుడు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బూరాడపేట జంక్షన్ వద్ద నడిపల్లి రామునాయుడు చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని కొనియాడారు. కార్యక్రమంలో తుమ్మలపేట పీఏసీఎస్ చైర్మన్ కోట్ల పైడినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు సంగంరెడ్డి జగన్నాథం, నాయకులు బెల్లాన రామారావు, మక్కువ వెంకటరమణ, కర్రోతు వెంకటరమణ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజమ్మ తల్లి పండుగ

గుర్ల: మండలంలోని సొలిపిసోమరాజుపేటలో రాజమ్మ తల్లి పండుగను ఆదివారం ఘనంగా చేపట్టారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమతో అభిషేకాలు చేశారు. జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, పార్టీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

145 మందికి కంటి పరీక్షలు

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 145 మందికి వైద్యులు కంటి పరీక్షలు చేశారు. వారిలో 55 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వారికి ఉచితంగా ఆపరేషన్ చేసి మందులు, కళ్లద్దాలు అందజేయనున్నట్లు చెప్పారు. కొట్టాం పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది శిబిరంలో సేవలందించారు.

విద్యార్థులకు సత్కారం

జామి: విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని లోక్‌సత్తా రాష్ట్రపార్టీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, బోనంగి హైస్కూల్ హెచ్‌ఎం నర్సింగరావు అన్నారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు అట్టాడ బీఎస్‌ఆర్ ఆశ్రమంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. జామి హైస్కూల్‌లో 1980లో పదో తరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. తాము చదువుకునే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు ఉండేవి కావని, కానీ ప్రస్తుతం విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులను ప్రభుత్వం సమకూరుస్తోందని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు.

తాగునీటి బోరు ఏర్పాటు

వేపాడ: మండలంలో ఆతవ సచివాలయం పరిధి ఆకులసీతంపేట గ్రామంలో జలజీవన్ మిషన్ కింద తాగునీటి బోరు వేశారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు అడపా ఈశ్వరరావు, గ్రామ పెద్దలు కొబ్బరికాయ కొట్టి బోరు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ బోరు ద్వారా గ్రామంలో ఇంటింటికీ తాగునీరు అందించనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు.

తాగునీటి సమస్యకు..
శాశ్వత పరిష్కారం

- పట్టణంలో చురుగ్గా ఏఐఐబీ తాగునీటి పథకం పనులు
- రూ. 35 కోట్లతో తాగునీటి ట్యాంక్‌లు, గ్యాలరీల నిర్మాణం
- పట్టణవ్యాప్తంగా 4500 కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు
- నగర పంచాయతీ ప్రజలకు మరింత పుష్కలంగా తాగునీరు



జరజాపుపేటలోని వాటర్ గ్యాలరీ



కొండపేటలో జేసీబీతో పనులు

నెల్లిమర్ల: పట్టణవాసులకు మరింత పుష్కలంగా తాగునీటిని అందించాలన్న ప్రభుత్వ ఆశయం మరి కొద్ది రోజుల్లోనే నెరవేరబోతోంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ ద్వారా మంజూరైన తాగునీటి పథకం పనులు పట్టణంలో చురుగ్గా జరుగుతున్నాయి. రూ. 35 కోట్లతో స్థానిక చంపావతి నదిలో వాటర్ గ్యాలరీలు, ఇన్‌ఫిల్టరేషన్ బావులు, వేర్వేరు ప్రాంతాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మిస్తున్నారు. పథకాల నిర్మాణం పూర్తయితే పట్టణంలోని 20 వార్డులకు చెందిన 4,500 కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు మంజూరు చేస్తారు. దీంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడమే గాకుండా నెల్లిమర్ల నగర పంచాయతీకి చెందిన 30 వేల మంది ప్రజలకు మరింత పుష్కలంగా తాగునీరు అందుతుందనడంలో సందేహం లేదు. వివరాల్లోకి వెళితే..

రూ. 35 కోట్ల ఏఐఐబీ నిధులతో..

నెల్లిమర్ల నగర పంచాయతీలో తాగునీటి సమస్యకు పూర్తిస్థాయిలో చెక్ పెట్టడానికి ప్రభుత్వం రూ. 35 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్(ఏఐఐబీ) ద్వారా ఈ నిధులు మంజూరయ్యాయి. మంజూరైన నిధులతో పట్టణంలోని 20 వార్డులకు అవసరమైన తాగునీటిని సరఫరా చేయడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు.

పట్టణంలో చేపడుతున్న పనులివే

పట్టణంలో ప్రస్తుతం ఏఐఐబీ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. కొండపేట, పద్మశాలివీధి, జరజాపుపేట వద్ద చంపావతి నదిలో వాటర్ గ్యాలరీల నిర్మాణం చురుగ్గా చేపడుతున్నారు. జరజాపుపేట గ్యాలరీ నిర్మాణం పూర్తయ్యింది. ఇన్‌ఫిల్టరేషన్ బావి నిర్మాణం దాదాపు 40 శాతం పూర్తయ్యింది. మిగిలిన రెండు ప్రాంతాల్లోనూ గ్యాలరీల, ఇన్‌ఫిల్టరేషన్ బావుల నిర్మాణం ఇటీవల ప్రారంభమైంది. వీటి నిర్మాణం ప్రస్తుతం చురుగ్గా జరుగుతోంది. వేసవిలో సైతం నీరు నిల్వ ఉండేలా గ్యాలరీల నిర్మాణం చేపడుతున్నారు. అలాగే పట్టణంలోని మూడు ప్రాంతాల్లో ట్యాంకులను నిర్మిస్తున్నారు. జరజాపుపేటలో 500 కేఎల్, చంద్రబాబు కాలనీలో 300 కేఎల్, కొండపేటలో 200 కేఎల్ సామర్థ్యం గల ట్యాంకుల నిర్మాణం చురుగ్గా జరుగుతోంది.

4500 కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు

పట్టణంలోని 4500 కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు అందించనున్నారు. 20 వార్డుల్లో ఇప్పటికే ఉన్న కుళాయిలతో పాటు అదనంగా వీటిని ఏర్పాటు చేస్తారు. పథకం ఫేజ్-2లో భాగంగా పట్టణంలో తాగునీటి సరఫరాకు అవసరమైన కొత్త పైప్‌లైన్ వేయడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. దీంతో ప్రతి ఇంటికీ ఇకపై తాగునీరు పుష్కలంగా అందుతుందని చెప్పడంలో సందేహం లేదు. ముందు వేసవిలో సైతం ప్రతిరోజూ కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేయడానికి అవకాశముంటుంది.

టీడీపీ హయాంలో నిధులున్నా జరగని పనులు

నగరపంచాయతీలో తాగునీటి సరఫరాకు సంబంధించి ఏఐఐబీ నిధులు 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే మంజూరయ్యాయి. అయితే నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ ఆ ప్రభుత్వం పనులు చేపట్టలేదు. దిగిపోయే ముందు 2019లో హడావుడిగా శంకుస్థాపన చేశారు. అయినా పనులు ప్రారంభించలేదు.

చురుగ్గా పనులు



నగర పంచాయతీలో ఏఐఐబీ సహకారంతో తాగునీటి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రూ. 35 కోట్లతో చంపావతి నదిలో మూడు వాటర్ గ్యాలరీలు, ఇన్‌ఫిల్టరేషన్ బావుల నిర్మాణం చేపడుతున్నాం. అలాగే జరజాపుపేట, చంద్రబాబు కాలనీ, కొండపేటలో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం ప్రారంభమైంది. పనులు పూర్తయిన వెంటనే కుళాయి కనెక్షన్లు మంజూరు చేస్తాం.

–పి. బాలాజీ ప్రసాద్, నగరపంచాయతీ కమిషనర్

మరింత పుష్కలంగా తాగునీటి సరఫరా



ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడి చొరవతో పట్టణంలో చేపడుతున్న ఏఐఐబీ తాగునీటి పథకం పనులు పూర్తయితే 20 వార్డులకు మరింత పుష్కలంగా తాగునీరు అందుతుంది. ప్రస్తుతం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పూర్తయిన వెంటనే కుళాయి కనెక్షన్లు లేని వారందరికీ కొత్తగా మంజూరుచేయడం జరుగుతుంది.

–చిక్కాల సాంబశివరావు, వైఎస్సార్‌సీపీ పట్టణశాఖ అధ్యక్షుడు

మాజీ మంత్రి అశోక్‌వి చీప్ ట్రిక్స్

- మహనీయుల విగ్రహాలతో రాజకీయం చేయడం సిగ్గు చేటు
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రచారం కోసమే కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు చీప్ ట్రిక్స్ ఉపయోగిస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. పూలే విగ్రహం వద్ద కావాలని తాము తాళం వేసినట్లు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని రాజీవ్ నగర్ కాలనీ వద్ద ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆ మహానుభావుడు విగ్రహానికి పూల మాల వేసేందుకు అశోక్ గజపతిరాజు, తదితరులు వెళ్తూ.. మార్గమధ్యంలో కలెక్టరేట్ సమీపంలో ఉన్న పూలే విగ్రహానికి దండ వేసేందుకు ఆగారని.. అక్కడ ప్రహరీకి తాళం వేసి ఉండడంతో గేటుకు దండ తగిలించి ఆయన వెళ్లిపోయినట్లు తాను పత్రికల్లో చదివానన్నారు. అయితే తామేదో కావాలని తాళాలు వేసినట్లు అశోక్ గజపతిరాజు దుష్ప్రచారం చేయడం తగదన్నారు. గతంలో పైడితల్లి అమ్మవారి పండగ సమయంలో దర్శనానికి అవకాశం కల్పించలేదని ఆరోపిస్తూ పోలీస్ బీట్ వద్ద కూర్చున్న విషయం .. జిల్లా పరిషత్ సమావేశాల సందర్భంగా ఏసీ గదులన్న కారణంగా తలుపులు మూస్తే, కేవలం ఆయన వస్తున్నారన్న అక్కసుతోనే మూసివేశామని రాద్ధాంతం చేయడం అందరికీ గుర్తుందన్నారు. నిజంగా పూలే విగ్రహానికి దండ వేయాలని అనుకున్నప్పుడు కనీసం ముందు రోజైనా అధికారులకు సమాచారం ఇస్తే వారే తాళం తీయించి ఉంచేవారని చెప్పారు. ఇటీవల ఆ విగ్రహం అభివృద్ధి పనులు చేపట్టామని, వాటర్ ఫౌంటైన్ వంటివి ఏర్పాటు చేయడంతో సెల్ఫీలు తీసుకునేందుకు వీలుగా నిర్దుష్ట సమయాల్లో తెరిచి ఉంచుతున్నామని వివరించారు. కేవలం సుందరీకరణ పనులు పాడవ్వకూడదన్న ఉద్దేశంతోనే కొంత సమయం తాళం వేస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని రాజకీయంగా చూడడం సిగ్గుచేటన్నారు. మహనీయుల పట్ల టీడీపీ వారి కంటే తమకే గౌరవం ఎక్కువగా ఉందని, అందుకే నగరంలోని పలు కూడళ్ల వద్ద వారి విగ్రహాలు నెలకొల్పుతున్నామని తెలిపారు.

మద్యం దుకాణం తొలగించిన విషయం తెలియదా?

నగరంలోని ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద దండి మార్చ్ విగ్రహాలను ప్రారంభించినప్పుడే సమీపంలో ఉన్న మద్యం దుకాణాన్ని వేరే చోటకు తరలించాలని సంబంధిత అధికారులకు సూచించానని కోలగట్ల తెలిపారు. ఇప్పటికే అక్కడ మద్యం దుకాణాన్ని తరలించారని.. ఈ విషయం కూడా అశోక్‌గజపతిరాజుకు తెలియకపోవడం దురదృష్టకరమన్నారు. వాస్తవాలను తెలుసుకొని మాట్లాడాలని.. ఏం చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అశోక్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎవరి హయాంలో నియోజకవర్గ అభివృద్ధి జరిగిందో ప్రజలందరికీ తెలుసని కోలగట్ల స్పష్టం చేశారు.

27న మెగా రక్తదాన శిబిరం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు

విజయనగరం: డిప్యూటీ స్పీకర్, విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి జన్మదిన సందర్భంగా ఈ నెల 27న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు తెలిపారు. నగరంలోని కోలగట్ల నివాసం వద్ద ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వేసవి దృష్ట్యా రక్త నిల్వల కొరతను అధిగమించేందుకు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏటా మాదిరిగా ఈసారి కూడా వీరభద్రస్వామి జన్మదినం పురస్కరించుకుని వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. 28న దేవాలయాల్లో పూజలు, అన్నదానం, ఆస్పత్రి, ప్రేమ సమాజంలో రొట్టెల పంపిణీ, తదితర కార్యక్రమాలతో పాటు.. ప్రజల ఆకలిని తీర్చేందుకు ఆరో ఫుడ్ కోర్టును నగరంలోని కొత్తపేట వద్ద ప్రారంభించనున్నామని చెప్పారు. అదే రోజు ఉదయం అభిమానుల సమక్షంలో ఉపసభాపతి నివాసం వద్ద కేక్ కటింగ్ ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే పుట్టినరోజును పురస్కరించుకొని అభిమానులు, కార్యకర్తలెవరూ ఫ్లెక్సీలు, హోర్డింగులు కట్టవద్దని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, జోనల్ ఇన్‌చార్జ్‌లు డాక్టర్ వీఎస్ ప్రసాద్, ముద్దాడ మధు, కంటుభుక్త తవిటిరాజు, అల్లు చాణక్య, బాల బ్రహ్మారెడ్డి, పాల్గొన్నారు.

‘జగనన్న ఆణిముత్యాలు’కు ఆరుగురు ఎంపిక



పిల్ల జ్యోత్స్న బెల్లాన రేష్మ దేశెట్టి మధురవాణి



మానెం ఆశ్రిత మారోజు యశశ్విని ఎ.నవీన్‌కుమార్

నెల్లిమర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని పదో తరగతి పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ‘జగనన్న ఆణిముత్యాలు’ పురస్కారాలకు ప్రభుత్వం ఎంపిక చేసిన విషయం తెలిసిందే. నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి ఆరుగురు విద్యార్థులు ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి రెల్లివీధి బాలికోన్నత పాఠశాల విద్యార్థిని పిల్ల జ్యోత్స్న 582 మార్కులతో నియోజకవర్గంలో ప్రథమ స్థానంలో నిలిచింది. పట్టణంలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు బెల్లాన రేష్మ, దేశెట్టి మధురవాణి 580 మార్కుల చొప్పున సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే నెల్లిమర్ల మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాల విద్యార్థిని మానెం ఆశ్రిత, భోగాపురం ఆదర్శ పాఠశాల విద్యార్థిని మారోజు యశశ్విని కూడా 580 మార్కులు చొప్పున సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు.

పూసపాటిరేగ మండల కోనాడ ఉన్నత పాఠశాల విద్యార్థి అదపాక నవీన్‌కుమార్ 579 మార్కులతో తృతీయ స్థానం సాధించాడు. వీరిని నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 25న నెల్లిమర్లలో ప్రభుత్వం తరఫున ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు ఘనంగా సత్కరించనున్నారు. ప్రథమ బహుమతి రూ. 15 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ. 5 వేల నగదు పురస్కారాలను అందజేయనున్నారు.

బ్రాహ్మణులు సమాజానికి దిక్సూచి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



ఆరోగ్య గాయత్రి ఉచిత వైద్య శాలకు విరాళమందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: సమాజానికి బ్రాహ్మణులు దిక్సూచీ వంటి వారిని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కొనియాడారు. బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ఆరోగ్య గాయత్రి ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం స్థానిక రాజీవ్‌నగర్ కాలనీ వద్దనున్న గాయత్రి భవన్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదవారికి సాయం చేసే మంచిగుణం బ్రాహ్మణులకు ఎప్పుడూ ఉంటుందన్నారు. తనవృత్తి రాజకీయాలు అయినా, సమాజ సేవ అంటేనే ఇష్టమని.. అందుకే మొదటి నుంచి ప్రజాసేవకే అంకితమయ్యానని గుర్తు చేశారు. కొన్ని రుగ్మతల విషయంలో ఆరోగ్యశ్రీకి అవకాశం ఉండదని, అటువంటి కేసుల విషయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి వచ్చేలా తనవంతుగా తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో అవినీతి, లంచగొండితనం లేని పాలన అందిస్తున్నామని తెలిపారు. అనంతరం బ్రాహ్మణ సమాఖ్య నిర్వహిస్తున్న ఆరోగ్య గాయత్రి ఉచిత వైద్యశాలకు ఆర్థిక తోడ్పాటు కోసం తన వంతు సహాయంగా రూ.10 వేల విరాళాన్ని ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు శ్రీకాంత్, రమణమూర్తి, వెంకటరావు, అచ్యుతరామయ్య, బాపూజీ, రాంజీ, సూర్యలక్ష్మి, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఎస్సైని తొలగించాలి..!



ధర్నా చేస్తున్న తూర్పు కాపు సామాజికవర్గ ప్రతినిధులు

విజయనగరం: ఒక బాధ్యత గల పోలీస్ అధికారి అయి ఉండి, సామాజికవర్గాలను కించపరిచేలా కులం పేరిట దూషించడం ఎంతవరకూ సమంజసమని తూర్పుకాపు సామాజికవర్గ నాయకులు ప్రశ్నించారు. తక్షణమే ఎస్సైని తొలగించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. తూర్పు కాపులను కించపరిచే విధంగా వ్యవహరించిన డీటీసీ ఎస్సైను విధుల నుంచి సస్పెండ్ చేయాలని కోరుతూ.. ఆ సామాజికవర్గ నాయకులు రాజకీయాలకు అతీతంగా తరలివచ్చి ఆదివారం విజయనగరంలో నిరసన చేపట్టారు. ముందుగా కలెక్టరేట్ సమీపంలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు సంగంరెడ్డి బంగారునాయుడు, నడిపేన శ్రీనివాసరావు, పాలవలస యశస్వి, రొంగలి రామారావు, తదితరులు మాట్లాడుతూ... ఒక కేసు విషయంలో సంబంధం లేకపోయినా డీటీసీ ఎస్సై ప్రకాష్ కాపు వర్గీయులపై దుర్భాషలు ఆడడమే కాక, తీవ్ర పదజాలంతో దూషించారని తెలిపారు. అతనిపై చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తూర్పు కాపు సంఘం పెద్దలు, నాయకులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఐఐటీ, నీట్ కోచింగ్‌కు ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న గురుకులాల జిల్లా సమన్వయకర్త బి.చంద్రావతి

కొత్తవలస: సోషల్ వెల్ఫేర్ కళాశాలల్లో ఐఐటీ, నీట్ ప్రవేశ పరీక్షల శిక్షణకు సంబంధించి ఆదివారం వియ్యంపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. 68 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 57 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ టి.జయశ్రీ తెలిపారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కార్పొరేట్ కాలేజీల మాదిరిగా ఇంటర్మీడియట్ విద్యతో పాటు ఐఐటీ, నీట్ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. గురుకులాల జిల్లా సమన్వయాధికారి బి.చంద్రావతి పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆదివారం జరిగిన పోటీలో గజపతినగరం, మెంటాడ జట్లు తలపడ్డాయి. గజపతినగరం జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 97 పరుగులు చేయగా.. మెంటాడ జట్టు 16 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. విజేతలకు టోర్నీ నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు.

వచ్చే నెల నుంచి గోధుమల పంపిణీ

చీపురుపల్లి: రేషన్ లబ్ధిదారులకు చౌకధరల దుకాణాల ద్వారా గోధుమలు సరఫరా చేయనున్నట్లు సివిల్‌సప్లై డీటీ పిన్నింటి రామారావు తెలిపారు. ఈ మేరకు వంగపల్లిపేటలో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1 నుంచి రేషన్ లబ్ధిదారులకు బియ్యం, పప్పు, పంచదారతో పాటు గోధుమలను సరఫరా చేయనున్నట్లు చెప్పారు. కిలో రూ.10లు చొప్పున ఒక్కో కార్డుకు మూడు కిలోలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గిరిడ రాందాసు, వార్డు మెంబరు పోలీసు, మీసాల సీతారాం పాల్గొన్నారు.

ఆక్రమణకు పాల్పడేవారిపై కేసులు నమోదు చేస్తాం

- నేషనల్ హైవే డీఈ కేవీఎన్ నర్సింహారావు



ప్రభుత్వ స్థలంలో వేసిన మట్టిపోగులు

గజపతినగరం: మండల కేంద్రంలో చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులకు ఆటంకం కలిగించే వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు నేషనల్ హైవే డీఈ కేవీఎన్ నర్సింహారావు అన్నారు. గజపతినగరం శ్రీకృష్ణా విద్యాపీఠం స్కూల్ ఎదురుగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు వాహనాల పార్కింగ్ కోసం మట్టిని వేసి చదును చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. వెంటనే పనులు నిలిపివేయాలని వారిని ఆదేశించినట్లు చెప్పారు. పురిటిపెంట గ్రామ పంచాయతీ అధికారులు కూడా మట్టిని వేసిన వారిని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి పనులు చేపట్టినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాజీవ్‌గాంధీకి నివాళి

శృంగవరపుకోట: స్థానిక గాంధీ పార్కు వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడి బంగారునాయుడు ఆధ్వర్యంలో దివంగత ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఆయన ప్రవేశపెట్టిన పథకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీసెల్ చైర్మన్ చీమల అచ్చిబాబు, హెచ్.నానాజీ, కాంగ్రెస్ రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తవలస, లక్కవరపుకోట: ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు పి.శివప్రసాద్, కె.ధర్మకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 21 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు నిర్ణీత ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఓసీ, బీసీలకు రూ.200, ఎస్సీ, ఎస్టీలకు రూ.150 ఫీజు నిర్ణయించినట్లు తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రం, 10వ తరగతి హాల్‌టికెట్, మార్కుల మెమో, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తిచేసి ఒక కాపీని సంబంధిత కళాశాలలో అందజేయాల్సి ఉంటుందన్నారు.

నగదు ప్రోత్సాహకానికి ఎంపిక

వేపాడ: స్థానిక ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన ఆర్.అనుష ప్రభుత్వం అందించే నగదు ప్రోత్సాహకానికి ఎంపికైందని ప్రిన్సిపాల్ యు.ఉషారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీలో 968/1000 మార్కులతో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు.